క్లుప్తంగా

సెల్ఫీ ప్లీజ్..



ఐదోతరగతి విద్యార్థిని అశ్వితతో సెల్ఫీ తీసుకుంటున్న కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ

బొబ్బిలి రూరల్: ఆ చిన్నారి మాటలకు ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, కలెక్టర్ సూర్యకుమారి మురిసిపోయారు. ఐదో తరగతి చిన్నారితో సెల్ఫీలు దిగారు. ఈ ఘటన విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. పాఠశాల తనిఖీకి వచ్చిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఐదో తరగతి గదిలోకి రాగానే అందరూ గుడ్‌మార్నింగ్ చెప్పారు. చురుగ్గా ఉన్న అశ్వితను ప్రిన్సిపాల్ సెక్రటరీ పిలిచి పెద్దాయ్యాక ఏమవుతావని ప్రశ్నించారు. విద్యార్థిని వెంటనే కలెక్టర్ అవుతానని సమాధానం చెప్పడంతో అభినందించారు. కలెక్టర్ గారూ అశ్వితతో సెల్ఫీ తీయండి అనడంతో కలెక్టర్ సూర్యకుమారి.. అశ్విత, ప్రిన్సిపల్ సెక్రటరీతో కలిసి సెల్ఫీ తీశారు.

రేజేరులో పొలంబడి

బాడంగి: మండలంలోని రేజేరులో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి కె.శిరీష ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఏఏ సాయికుమార్, రైతులతో కలిసి అపరాల పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

వంగర: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తహసీల్దార్ డి.ఐజాక్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశమైన ఆయన ఓటరు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, ఓటు గుర్తింపు కార్డులు అందజేత, ముగ్గులు పోటీలు చేపట్టాలని తెలిపారు.

రీ సర్వే వేగవంతం



సీహెచ్ బొడ్డవలసలో రీసర్వే పరిశీలిస్తూ, సిబ్బందికి సూచనలిస్తున్న సుదర్శనదొర

బొబ్బిలి రూరల్: భూముల రీసర్వే వేగవంతం చేయాలని సమగ్ర భూ రీసర్వే ప్రత్యేక ఉప కలెక్టర్ బి.సుదర్శనదొర సర్వే సిబ్బందిని ఆదేశించారు. బొబ్బిలి మండలంలో రీసర్వే నెమ్మదించిందని ఉన్నతాధికారులు సూచించడంతో ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శనదొర మండలంలో సీహెచ్ బొడ్డవలసలో జరుగుతున్న రీసర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మ్యాప్‌లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ అప్పారావు, భూ రీసర్వే డీటీ జి.అప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డ్ కౌన్సిలర్ తిరుమలరావు

తెర్లాం: డీసీసీబీ ఖాతాదారులతో పాటు ప్రజలందరూ ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డ్ కౌన్సిలర్ పాండ్రంకి తిరుమలరావు అన్నారు. శుక్రవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సుపల్లి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, డీసీసీబీ ద్వారా ఖాతాదారులు, ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు. డీసీసీబీలో డిపాజిట్లపై అధిక వడ్డీ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

వీణల తయారీ కేంద్రాన్ని సందర్శించిన ప్రవీణ్ ప్రకాష్



వీణతో ప్రవీణ్‌ప్రకాష్

బొబ్బిలి: పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బొబ్బిలి వీణల తయారీకేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీణలు తయారు చేస్తున్న కార్మికులతో మాట్లాడి, కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. వీణల ప్రాశస్త్యాన్ని ఆర్డీఓ పి.శేషశైలజ, తయారీకేంద్రం ఇన్‌చార్జ్ రామకృష్ణ వివరించారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

బొబ్బిలి: మద్యం విక్రయిస్తున్న రామభద్రపురం మండలం అప్పలరాజుపేటకు చెందిన లెంక వెంకటరావును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఆర్. జైభీమ్ తెలిపారు. నిందితుడి వద్ద 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు మూడున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను నేతలు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేవి కాదని, జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పథకాలు ఇచ్చేవారన్నారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరి వద్దకు పథకాలు వచ్చి చేరుతున్నాయన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ నిధులతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలన్నారు. రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డి. అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, సర్పంచ్ ఎల్.రాంబాబు, మండల సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల అబ్జర్వర్ పి.రామచంద్రినాయుడు, రాజాం టౌన్ కన్వీనర్ పి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

- రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం సిటీ: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే కంబాల

రాజాం సిటీ: అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకు శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. మితిమీరిన వేగంతో వెళ్లి, ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దన్నారు. ద్విచక్రవాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్లను డ్రైవింగ్‌కు ప్రోత్సహించకూడదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, సీఐ కె.రవికుమార్, ఎస్ఐలు పి.సూర్యకుమారి, వీబీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంతకవిటి: వైద్య శిబిరం ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహనరావు

సంతకవిటి: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో పోలీసులు, విద్యార్థులు కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్థనరావు, సచివాలయాల మండల కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: ఉపాధి హామీ ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి ఏపీఓ, సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18న నిర్వహించిన సమీక్ష సమావేశంలో సూచించిన అంశాలకు సంబంధించిన నిజనిర్ధారణ పత్రాలు క్లస్టర్ల వారీగా చూపించాలని కోరారు. రికార్డుల నిర్వహణలో గాని వేతనదారులకు పనులు కల్పించడం, కొలతలు తీయడంలో నిర్లక్ష్య ధోరణి తగదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

చెరువు పనుల తనిఖీ...

మండలంలోని ఎంఆర్ అగ్రహారంలోని గవరయ్య చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఏపీఓ జగదీశ్వరరావు, సాంకేతిక సహాయకులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

- పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, కలెక్టర్ సూర్యకుమారి

రామభద్రపురం: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను కలెక్టర్ సూర్యకుమారితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం ఆయన సందర్శించారు. ఈ సమయంలో విద్యార్థులు భోజనాలకు సిద్ధం కావడంతో ప్రవీణ్ ప్రకాష్ స్వయంగా వడ్డించారు. అనంతరం కలెక్టర్ సూర్యకుమారితో కలసి భోజనం చేశారు. భోజనం బాగుండడంతో సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో ఎన్ని పాఠశాలలున్నాయి... ఎంతమంది విద్యార్థులున్నారు.. ఏయే రోజుల్లో గుడ్లు, చెక్కీలు ఇస్తున్నారు.. తదితర విషయాలను ఎంఈఓ తిరుమల ప్రసాద్‌ను ప్రశ్నించగా..ఆయన సరైన సమాధానాలు చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్‌జేడీ జ్యోతి, డిఈఓ, డిప్యూటీ డీఈఓలను ప్రశ్నించగా.. వారు కూడా సమాధానం చెప్పలేకపోవడంతో.. మీకు బాధ్యత లేదా అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యాశాఖ, జగనన్న గోరుముద్ద, నాడు – నేడు, తదితర అంశాలపై ప్రతిరోజూ 25 నిమిషాల పాటు సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అలాంటప్పుడు అధికారులు ఎంత చిత్తశుద్ధితో వ్యవహరించాలని ప్రశ్నించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం 6వ తరగతి పిల్లల విద్యాసామర్థ్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ జ్యోతి, డీఈఓ లింగేశ్వర రెడ్డి, ఏపీసీ వి. అప్పలస్వామినాయుడు, ఎంఈఓ తిరుమల ప్రసాద్, తహసీల్దార్ పి. గణపతిరావు, ఎంపీడీఓ రమామణి, తదితరులు పాల్గొన్నారు.

రూ.11.81 కోట్లతో 'నాడు – నేడు' పనులు

- ఆర్‌జేడీ శారద



కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ శారద

బాడంగి: విజయనగరం జిల్లాలో మొత్తం 18 ప్రభుత్వ కళాశాలలు ఉండగా.. 17 కళాశాలల్లో రూ.11.81 కోట్లతో నాడు–నేడు పనులు చేపడుతున్నట్లు జోన్ 1, 2 ఆర్‌జేడీ ఐ.శారద అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో ఆమెతో పాటు డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్, ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వి.శంకరరావు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి రుణాలు



ఏపీఎం వెంకటరమణకు మెమెంటో అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి

రామభద్రపురం: స్త్రీ నిధి రుణాల మంజూరులో గజపతినగరం క్లస్టర్ పరిధిలోని ఏడు మండలాల్లో రామభద్రపురం టాప్ వన్‌లో నిలిచిందని డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి తెలిపారు. ఈ మేరకు మండల ఏపీఎం జి. వెంకటరమణను శుక్రవారం అభినందిస్తూ మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 6.37 కోట్ల రుణాల మంజూరు లక్ష్యం కాగా 6.50 కోట్ల రూపాయల రుణాలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ కె. సావిత్రి, ఏజీఎం ఉమామహేశ్వరరావు, ఏసీ లక్ష్మనాయుడు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

తెర్లాం: జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేలో జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని అప్పలంపేటలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సమక్షంలో సరిహద్దులు గుర్తించాలన్నారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

ఘనంగా సంతోషిమాత జాతర

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సంతోషిమాత జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మీగడ భాగ్యలింగం స్వామి, మీగడ విశ్వేశ్వరరావుస్వామి భక్తులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారి దర్శనానంతరం తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

నేడు ఆమదాలవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలంతా హాజరు కావాలని వారు కోరారు.

ఆర్బీకే తనిఖీ

తెర్లాం: మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రాన్ని పశు సంవర్ధకశాఖ బొబ్బిలి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నీలయ్యరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

నివాళులు..

తెర్లాం: మండలంలోని రాజయ్యపేటకు చెందిన రైల్వే ఉద్యోగి గవర రామకృష్ణ విధి నిర్వహణలో రైలు ఢీకొనడంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం ఉదయం గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఓదార్చారు. ఆయనతో పాటు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరామర్శ

బొబ్బిలి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న తూర్పు భాగవతార్ బొంతలకోటి శంకరరావును మండలంలో కోమటపల్లిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు శుక్రవారం పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామని శంబంగి హామీ ఇచ్చారు. ఆయన వెంట వెలమల సింహాచలం, ఆవాల పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

రాజాం: పట్టణ పరిధిలోని బుచ్చింపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పిట్టా జగదీష్ పేదలకు శుక్రవారం దుస్తులు వితరణ చేశారు. ఏటా నిరుపేదలకు సాయం చేసి, ఆదుకోవడంలో సంతృప్తి ఉందని దాత తెలిపారు.

నాణ్యమైన ఎరువు తయారు చేయండి

రాజాం సిటీ: గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి చెత్త సంపద సృష్టి కేంద్రాల్లో నాణ్యమైన ఎరువు తయారు చేయాలని ఈఓపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నందబలగ గ్రామ చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన ఆయన అక్కడి క్లాప్ మిత్రలకు చెత్త నుంచి ఎరువుల తయారు చేయడంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, సేకరించిన తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాలని, ఈ ఎరువును సబ్సిడీపై రైతులకు అందజేసి, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కషాయం తయారీపై అవగాహన

రేగిడి: మిరప పంటకు సోకుతున్న తామరపురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన కషాయ ద్రావణం వాడాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సీహెచ్ శారద సూచించారు. మండలంలోని ఉంగరాడ గ్రామంలో వివిధ కషాయ ద్రావణాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. చాలా మంది రైతులు పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణకు రసాయనిక ఎరువులు వాడుతుంటారని అయితే ఇది మంచి విధానం కాదన్నారు. సేంద్రియ సాగు, ఎరువులు వాడితే పంటతో పాటు నేలసారం కూడా బాగుంటుందన్నారు. తక్కువ వ్యయంతో ఆవుపేడ, గోమూత్రంతో చేసే కషాయాలు పంటలకు వాడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎల్లోమీడియా రాతలు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు



మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

రేగిడి: ప్రజలను తప్పుదోవ పట్టించేలా రాష్ట్రంలోని ఎల్లోమీడియా రాతలు ఉన్నాయని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. వలంటీర్ల ద్వారానే అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేయడం జరుగుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శక పాలన రాష్ట్రంలో కొనసాగుతుందన్నారు. ఇది చూసి ఓర్వలేని ఎల్లోమీడియా ప్రభుత్వంపై విషం చిమ్ముతూ కథనాలు ప్రచురించడం దారుణమన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి, వలంటీర్లు అందించిన సేవల వైపు ప్రపంచమంతా చూసి మెచ్చుకుందన్నారు. అటువంటి వ్యవస్థపై ప్రతిపక్ష టీడీపీ, ఎల్లోమీడియా తప్పుడు భావన ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర ప్రజానీకమంతా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని జోస్యం చెప్పారు. చంద్రబాబు అండ్ కో ప్రభుత్వంపై చేస్తున్న, చేయిస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో ప్రజలకు బాగా తెలుసన్నారు. సమావేశంలో ఎంపీపీ డి.అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బాడంగి: వచ్చే ఏడాదిలో జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలందరూ సైనికుల్లా పోరాడాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక స్వామి కల్యాణ మంటపంలో పార్టీ మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికలు చాలా కీలకమైనవన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీలు వేస్తామని, పార్టీకి సేవ చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్న నేపథ్యంలో జగనన్న పాలనపై ప్రజలందరికీ నమ్మకం ఉందని తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యుల పెత్తనం ఉండేదని, నేడు మాత్రం అర్హత ఉంటే చాలు పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న మనకు ఓటు అడిగే హక్కు ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎంత చక్కగా పరిపాలిస్తున్నా, ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, డైరెక్టర్లు జి.లక్ష్మునాయుడు, పి.కృష్ణమూర్తి, ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ యు.చిన్నప్పదొర, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ బోగి గౌరి, సలహాదారు మధుసూదనరావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను కించపరచడం తగదు

- ఎమ్మెల్యే శంబంగి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ఎంతో సేవా దృక్పథంతో ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థను కించపరుస్తూ ఈనాడులో వార్తలు రాయడం సరికాదని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నామమాత్రపు గౌరవ వేతనంతో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా నిలిచి సంక్షేమ పథకాలు అందిస్తుంటే కట్టుకథలు రాయడం తగదని సూచించారు. ఒక్క వలంటీర్ అయినా అవినీతి చేసినట్లు నిరూపించగలరా అని ప్రశ్నించారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సభ్యులు ఎంత అవినీతి చేశారో అందరికీ తెలిసిందేనన్నారు. పథకాలు అందించడానికి వలంటీర్ల సేవలు వినియోగించుకుంటుంటే.. రాజకీయంగా వాడుకుంటున్నట్లు కథనాలు వండివార్చడం నిజమైన జర్నలిజం కాదన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, డైరెక్టర్ లక్ష్మునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు రామారావు, ఎంపీపీ గౌరి, వైస్ ఎంపీపీ రమేష్ పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: మండల కేంద్రంలోని టీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరగనున్న సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కె. రాజేశ్వరరావు పాల్గొని పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, దర్రు పైడిరాజు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి దామోదరరావు

బొబ్బిలి: వచ్చే నెల 11న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. దామోదరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఆయన న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టు పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. సివిల్, క్రిమినల్, ప్రిలిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి. వాసుదేవన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జే. సౌమ్య జోసెఫిన్, బార్ అధ్యక్షుడు సీహెచ్ రామారావు, కార్యదర్శి డి. అప్పలరాజు, ఏజీపీ, ఏపీపీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ సంగంనాయుడు

రేగిడి: మండలంలోని లింగాలవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీఓ ఎస్.హరనాథ్ పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ రెండు పూటలా పనులు చేసుకుంటే రూ.257 వేతనం వస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్లు ఉండేలా చూసుకోవాలన్నారు.

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ ఎస్. సంగంనాయుడు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని సూచించారు. వేతనదారులంతా రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఆదినారాయణ పాల్గొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు

వంగర: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతులు, వాటి పరిష్కారంపై ఆరాతీశారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పల్లెలు పరిశుభ్రంగా ఉంచాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎల్. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి

మెంటాడ: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని ఎంపీడీఓ త్రివిక్రమ్ తెలిపారు. మండలంలోని చల్లపేట ఊరచెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజుకు రూ. 257 వేతనం వచ్చేలా పనులు కల్పించాలని సూచించారు.